# భద్రాద్రిలో భారీ ఆపరేషన్.....

- పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా మాఫియా బహిర్గతం....
- జిపిఎస్ మార్పిడి – నకిలీ ఎంట్రీలు...
- 300 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం మళ్లింపు గుట్టురట్టు
- పిడిఎస్ బియ్యం మాఫియా రింగ్ పై విజిలెన్స్ దాడులు...
- లక్షల్లో ప్రభుత్వనీకి నష్టం
- పిడిఎస్ బియ్యం మాఫియాలో పాల్వంచకు చెందిన పలువురు డీలర్లు?



7 లో...


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి


ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 6 | డిసెంబర్ | 2025 ◆ పేజీలు : 7


- నరసయ్య బయోపిక్ కు నేడే ఘన ఆరంభం
- వేదికకు ముస్తాబైన హెచ్ కన్వర్షన్ హాల్
- ప్రజా నాయకుడి కథను.. ప్రజా వేదికగా ప్రారంభం
- హాజరుకానున్న.. గుమ్మడి నర్సయ్య, డా. శివరాజ్ కుమార్, పరమేశ్వర్ యూరాలే, నల్లా సురేష్ రెడ్డి



విలువల రాజకీయానికి ప్రతీకగా నిలిచిన గుమ్మడి నరసయ్య జీవితం ఆధారంగా అతని పేరుతోనే రూపొందుతున్న పాన్ –ఇండియా చిత్రానికి నేడు ఘనమైన ప్రారంభోత్సవ వేడుక జరగనున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని హెచ్–కన్వెన్షన్ హాల్ ఈ వేడుకకు వేదికగా సిద్ధమైంది. నర్సయ్య ప్రజా జీవితం, ఆయన పోరాటాలు, విలువలతో నిండిన రాజకీయ ప్రయాణాన్ని తెరపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ సినిమా నిర్మాణం ప్రారంభం కానుండటం స్థానికంగా భారీ ఆసక్తిని రేపుతోంది. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారు. నిర్మాత నల్లా సురేష్ రెడ్డి సమర్పిస్తున్న ఈ చిత్రానికి మహారాష్ట్రకు చెందిన పరమేశ్వర్ యూరాలే దర్శకత్వం వహిస్తున్నారు.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

# ప్రజా వేదికగా ...

# గుమ్మడి వేడుక...

2 లో..

- కొనసాగింపుకు కేంద్ర – రాష్ట్ర క్లియర్ సంకేతాలు
- ఏడేళ్లు దాటి కూడా నమ్మకమే ఆధారం
- బలరాం నాయకత్వంపై ప్రభుత్వాల పూర్తి భరోసా
- సింగరేణికి అవసరమైన స్థిరత్వం – అనుభవం
- కార్మికులకు చేరువైన సింపుల్ అడ్మినిస్ట్రేటర్
- పరిపాలనలో క్రమశిక్షణకు కట్టుబాటు
- కీలక ప్రాజెక్టులకు నిరంతర అనుసంధానం


# సిఎండి కొనసాగింపు... లాంఛనమే....



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 05, ప్రజాజ్యోతి:** సింగరేణి కోలరీస్ కంపెనీ లిమిటెడ్ లో సిఎండి పదవీ వ్యవహారం ప్రస్తుతం పాజిటివ్ దిశగా సుస్థిరంగా కదులుతోంది. 2018 డిసెంబర్ 5న డిప్యూటేషన్ పై వచ్చిన సివిల్ సర్వెంట్ అధికారి బలరాం నాయక్, గత ఏడేళ్లలో సంస్థను ఆద్యంతం మార్పు దిశగా నడిపిన తీరు.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వద్ద బలమైన గుర్తింపు తెచ్చిపెట్టింది. ఇందువల్లే సాధారణ ఐదేళ్ల డిప్యూటేషన్ పరిమితిని దాటి, ఏడేళ్ల సేవ పూర్తైన ఈ సమయంలో కూడా మరింత కొనసాగింపుకు సంబంధిత చర్యలు దాదాపు ముగింపు దశకు చేరాయని అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది. డిప్యూటేషన్ నిబంధనల ప్రకారం కేంద్ర సేవా అధికారులు ఏడు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం కొనసాగడం అత్యంత అరుదైన విషయం. అలాంటి మినహాయింపు రావాలంటే కేంద్ర డిఓపిటి (డిపార్ట్మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్), ప్యారెంట్ కేడర్, రాష్ట్ర ప్రభుత్వం—ఈ మూడు స్థాయిల్లోనూ ప్రత్యేక అనుమతులు అవసరం. ఇలాంటి అరుదైన అవకాశంలో కూడా బలరాం నాయక్ కు కొనసాగింపు దిశ బలపడటానికి కారణం ఆయన నిరంతర కృషి. ప్రతిరోజూ 16–18 గంటలు పనిచేస్తూ, ఆధునీకరణ, పారదర్శకత, ఉత్పత్తి పెంపు, సాంకేతిక పరివర్తనలు, ప్రమాదాల నియంత్రణ వంటి విభాగాల్లో తీసుకున్న నిర్ణయాలు—సింగరేణిని జాతీయ స్థాయిలో ముందువరుసకు తెచ్చాయి. ఇదే సమయంలో సింగరేణి యాజమాన్యం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ–అభివృద్ధి పథకాలు ప్రస్తుత రాష్ట్రప్రభుత్వానికి మంచి పేరును తెచ్చాయి. ఉద్యోగులకు కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా, కాంట్రాక్ట్ కార్మికులకు 40 లక్షల వరకు ప్రమాద బీమా, సివిల్స్ కు సిద్ధమవుతున్న ఆశావాహులకు లక్ష రూపాయల ఆర్థిక ప్రోత్సాహం, విద్యార్థుల కోసం "చీఫ్ మినిస్టర్ పిహెచ్ డీ ఫెలోషిప్" పేరిట రూ.10,000 స్టైపెండ్

మిగతా 2 లో...

- నరసయ్య బయోపిక్ కు నేడే ఘన ఆరంభం
- వేదికకు ముస్తాబైన హెచ్ కన్వర్షన్ హాల్
- ప్రజా నాయకుడి కథను.. ప్రజా వేదికగా ప్రారంభం
- హాజరుకానున్న.. గుమ్మడి నర్సయ్య, డా. శివరాజ్ కుమార్, పరమేశ్వర్ యూరాలే, నల్లా సురేష్ రెడ్డి



విలువల రాజకీయానికి ప్రతీకగా నిలిచిన గుమ్మడి నరసయ్య జీవితం ఆధారంగా అతని పేరుతోనే రూపొందుతున్న పాన్ –ఇండియా చిత్రానికి నేడు ఘనమైన ప్రారంభోత్సవ వేడుక జరగనున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని హెచ్–కన్వెన్షన్ హాల్ ఈ వేడుకకు వేదికగా సిద్ధమైంది. నర్సయ్య ప్రజా జీవితం, ఆయన పోరాటాలు, విలువలతో నిండిన రాజకీయ ప్రయాణాన్ని తెరపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ సినిమా నిర్మాణం ప్రారంభం కానుండటం స్థానికంగా భారీ ఆసక్తిని రేపుతోంది. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారు. నిర్మాత నల్లా సురేష్ రెడ్డి సమర్పిస్తున్న ఈ చిత్రానికి మహారాష్ట్రకు చెందిన పరమేశ్వర్ యూరాలే దర్శకత్వం వహిస్తున్నారు.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

# ప్రజా వేదికగా... గుమ్మడి వేడుక...

విలువల రాజకీయానికి ప్రతీకగా నిలిచిన గుమ్మడి నరసయ్య జీవితం ఆధారంగా అతని పేరుతోనే రూపొందుతున్న పాన్ –ఇండియా చిత్రానికి నేడు ఘనమైన ప్రారంభోత్సవ వేడుక జరగనున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని హెచ్–కన్వెన్షన్ హాల్ ఈ వేడుకకు వేదికగా సిద్ధమైంది. నర్సయ్య ప్రజా జీవితం, ఆయన పోరాటాలు, విలువలతో నిండిన రాజకీయ ప్రయాణాన్ని తెరపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ సినిమా నిర్మాణం ప్రారంభం కానుండటం స్థానికంగా భారీ ఆసక్తిని రేపుతోంది. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారు. నిర్మాత నల్లా సురేష్ రెడ్డి సమర్పిస్తున్న ఈ చిత్రానికి మహారాష్ట్రకు చెందిన పరమేశ్వర్ యూరాలే దర్శకత్వం వహిస్తున్నారు. ముఖ్యంగా, కన్నడ సూపర్ స్టార్ డాక్టర్ శివరాజ్ కుమార్ నర్సయ్య పాత్రను పోషిస్తున్న విషయం ఇప్పటికే ఈ చిత్రంపై భారీ చర్చను తెచ్చింది. నిలకడ, నిబద్ధత, ప్రజా ధార్మికతతో నిండిన గుమ్మడి నరసయ్య జీవితం వెండితెరపై ఎలా రూపుదిద్దుకోబోతుందన్న ఉత్సాహం జిల్లా ప్రజల్లో కనిపిస్తోంది. నేటి "గుమ్మడి వేడుక"తో సినిమా తొలి అడుగు పడనుండగా, భద్రాద్రి నేల ప్రజా విలువల కథనానికి వేదికకానుంది.

## ప్రజా పోరాటాల కథ... సినీ లైట్ల కింద

1955లో టేకులగూడెం నుంచి బయలుదేరిన ఒక సాధారణ బాలుడు, కూలీల నడుమ పెరిగి, ఉద్యమాల వేడి చూశాడు. అక్కడే ఏర్పడ్డ ఆలోచన, ఆకలి బాధలతో ప్రజల సమస్యల్ని



గుండెల్లో పెట్టుకున్న జన నాయకత్వం — ఒక్క ముక్కలో చెప్పాలంటే అదే నరసయ్య. తెరకేక్కబోతున్న సినిమా ఈ ప్రయాణాన్నే మూడడుగుల మట్టివాసనతో, గనుల గర్జనతో, పల్లెటూరు దుప్పటి వెలుగులతో రెగ్యులర్ సినిమా మాదిరి కాకుండా వాస్తవ విజువల్స్ తో చూపించబోతోంది. అయితే ఈ నరసయ్య పాత్రలో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ రెమ్యూనరేషన్ లేకుండా నటించనుండటం అరుదైన నిర్ణయం. ఈ పాత్రను డాక్టర్ శివరాజ్ కుమార్ పాత్ర గా కాకుండా బాధ్యతగా తీసుకున్న విషయం ఇప్పటికే సినీ ప్రపంచంలో చర్చనీయాంశం. “ఇది నటించదగ్గ రోల్ కాదు.. నిలబడాల్సిన నిజం” అని ఆయన సినిమా టీమ్ తో చేసిన వ్యాఖ్యలు ప్రచారం లోకి రావడంతో ఈ సినిమా మీద ఆసక్తి మరింత పెరిగింది. దీంతో పాటు మమ్ముట్టి, జగపతిబాబు, సోనూసూద్, ప్రియమణి లాంటి జాతీయ స్థాయి తారాగణం ఇందులో నటించనున్నారు. ప్రధానంగా సంగీతం విరాటపర్వం ఫేమ్ సురేష్ బొబ్బిలి భానిలు ఈ చిత్రానికి ఉద్యమ గీతాల మాదిరిగా హృదయంలో దిగిపోతుందనే అంచనా ఏర్పడింది. దాంతో ఈ సినిమా పై పాన్ ఇండియా స్థాయిలో చర్చలు మరింత పెరిగింది.

## ఆసక్తిగా ఎదురు చూస్తున్న వేడుక..

ఇందుకై పాల్వంచలోని హెచ్ కన్వెన్షన్ హాల్ నేటి ఉదయం సినిమా సెట్స్ లా కాంతులతో మెరవబోతోంది. ఇది ఒక సాధారణ సినీ ఈవెంట్ కాదు.. ప్రజల మ ధ్య పుట్టి, ప్రజల కోసం బతికిన నాయకుడు గుమ్మడి నరసయ్య కథను వెండి తెరపైకి తీసుకువెళ్తున్న ప్రజా ఉత్సవం. ఈ ప్రాంత మట్టిని, ప్రజా రాజకీయాల విలువలను నిండుగా మోసుకుని తిరిగిన నరసయ్య జీవితానికోసం ప్రత్యేకంగా తెరకెక్కుతున్న పాన్ –ఇండియా సినిమాను నేడు రాముడి నెల సాక్షిగా అధికారికంగా ప్రారంభం కానుంది. ఇదొక శాసనసభ లెజెండ్ బయోగ్రఫీ కాదు.. పోరాటాల్ని, విలువల్ని, ప్రజా ధర్మాన్ని తిరిగి వెలిగించే ‘ప్రజా చలనచిత్రం’ రూపుదిద్దుకుంటుంది. సాధారణంగా పెద్ద హీరోల సినిమాలకు మాత్రమే కనిపించే ఆ చక్కదనం — ఈసారి ప్రజల మనసులో హీరోగా నిలిచిన గుమ్మడి నరసయ్యకోసం సిద్ధమైంది. “సినిమా హైదరాబాద్ లో కాదు.., ఎందుకు?” అని పలువురు అడిగితే. చిత్ర యూనిట్ నుండి సమాధానం ఒక్కటే.. “నరసయ్య పుట్టింది ఇక్కడే. ఈ నేలే కథ మొదలు. కాబట్టి మొదటి క్లాప్ కూడా ఈ నేలకే చెందాలి” అని.

## పరమేశ్వర్ యూరాలే కష్టం.. నల్లా సురేష్ రెడ్డి స్వప్నం..

ఈ చిత్రాన్ని పశ్చిమ మహారాష్ట్రకు చెందిన పరమేశ్వర్ యూరాలే దర్శకత్వం వహిస్తున్నారు. నర్సయ్య జీవితం, ఆయన ప్రజా పోరాటాలు, నిరాడంబర జీవన విధానాన్ని అర్థం చేసుకోవడానికి దర్శకుడు నాలుగేళ్లపాటు పరిశోధన చేసిన విషయం తెలిసిందే. అతని నాలుగేళ్ళ కష్టానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యువ నిర్మాత నల్లా సురేష్ రెడ్డి ప్రాణం పోసేందుకు నిర్మాణ భాద్యతలు చేపట్టారు. నేటి సమాజానికి విలువల రాజకీయాలు తెలుపాలనే అతని సంకల్పానికి ఈ కథే మూలాధారం అవుతుందని నిర్మాత సురేష్ రెడ్డి బలంగా విశ్వసిస్తున్నారు. నరసయ్య కథను దేశంతో పంచాలి” అన్న కలతో గత ఏడాది నుంచే బలమైన ప్రణాళికలు చేస్తూ ఈరోజు ఈ స్థాయిలో ఈవెంట్ ను నిర్వహించగలిగారు. సాధారణంగా నర్సయ్య పేరు వినగానే భద్రాద్రి నేల గర్వంగా తలెత్తుకుంటుంది. అలాంటి వ్యక్తిత్వం వెండితెరపైకి రావడం స్థానికంగా మాత్రమే కాదు రాష్ట్ర, దేశ వ్యాప్తంగా పెద్ద సందడిని సృష్టిస్తోంది.

## సిఎండి కొనసాగింపు... లాంఛనమే

(మొదటి పేజీ తరువాయి...)

ఇచ్చే పథకం — ఇవన్నీ రాష్ట్రవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచాయి. ఈ పథకాల వెనుక సింగరేణి యాజమాన్యం చూపిన చొరవ రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా మరింత ప్రజాదరణ వైపు నడిపింది. అదే సమయంలో సింగరేణిలో కొత్త బ్లాక్ లు, కొత్త మైన్ల ఏర్పాటు కూడా వేగం పుంజుకుంది. గతంలో కోల్ వేలంపాటల్లో పాల్గొనని సింగరేణి, బలరాం నాయక్ చొరవతో మళ్లీ వేలాల్లో ప్రవేశించి కొత్త బ్లాక్ లను దక్కించుకుంది. దీంతో రాగి, బంగారం వంటి విభాగాల్లోనూ మైనింగ్ కై అడుగుపెట్టేందుకు మార్గం సుగమమైంది. ఇప్పటికే సింగరేణి ఒడిశా, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తరించగా, వచ్చే ఏడాదిలో 10 రాష్ట్రాల్లో సంస్థ కొత్త అవకాశాలను అన్వేషించేందుకు ప్లాన్ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇలాంటి భారీ విస్తరణకి స్థిరమైన నాయకత్వం అవసరమన్న అభిప్రాయం సంస్థలో బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా సింగరేణిలోని కీలక సంచాలక పదవులన్నింటిలోనూ పనిచేసిన అనుభవం బలరాం నాయక్ కు ఒక ప్రత్యేక బలంగా నిలిచింది. ప్రాజెక్టులు, ఫైనాన్స్, పర్సనల్, ఆపరేషన్.. ఏ విభాగమైనా ఆయన ప్రత్యక్షంగా నిర్వర్తించిన పదవులు సంస్థ పరిపాలనలో లోతైన అవగాహనను ఇచ్చాయి. దీనికితోడు కార్మిక సంఘ నేతలతో సమన్వయం, ప్రతి కార్మికుడితో ఇమిడిపోయే ఆయన తత్వం సంస్థలో బలమైన విశ్వాస వాతావరణాన్ని నెలకొల్పింది. పై అధికారుల నుంచి కార్మికుల దాకా అందరికీ అందుబాటులో ఉండే నాయకత్వం... ఇదే ఆయనను “సింగరేణికి అవసరమైన సిఎండి”గా నిలబెట్టిందనే అభిప్రాయం కూడా అంతర్గతంగా వినిపిస్తోంది. ఇవన్నీ కాకుండా, బలరాం నాయక్ ఎస్టి సామాజిక వర్గానికి చెందిన అధికారి కావడం కూడా కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలకు పాజిటివ్ సంకేతంగా కనిపిస్తోంది. సామాజిక న్యాయం–ప్రతిభ సమన్వయంతో ఉన్నతస్థానాల్లో అవకాశాలు ఇవ్వాలన్న ప్రభుత్వ విధానానికి ఆయన కొనసాగింపు ప్రతీకగా నిలుస్తుందని పలువురు భావిస్తున్నారు. ఈ మొత్తం పరిణామాలను, ఫైళ్ల కదలికలు, ఉన్నతస్థాయి చర్చలు, సంస్థలోనూ.. ప్రభుత్వ అధికారుల్లోనూ వినిపిస్తున్న వ్యాఖ్యలను ఒక సారిగా పరిశీలిస్తే, బలరాం నాయక్ కొనసాగింపు ఇప్పుడు కేవలం లాంఛనమే అని స్పష్టంగా తెలుస్తోంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కోరగానే కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలత చూపిందన్న సమాచారం విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తోంది.

# సింగరేణి విజన్ డాక్యుమెంట్ 2030-2047 విడుదల

- 2030 నాటికి స్వల్ప, మధ్యకాలిక ప్రణాళిక ,
- 2047 నాటికి దీర్ఘకాలిక ప్రణాళికల రూపకల్పన
- 2030 నాటికి బహుముఖ వ్యాపార విస్తరణలు, భారీ అభివృద్ధి వ్యూహాలు
- 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి
- మొత్తం 5,850 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు
- దీర్ఘకాలిక ప్రణాళికలలో 2047
- 15 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్తు
- 25 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు
- కీలక ఖనిజ రంగంలో ప్రవేశం, అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సింగరేణి లిమిటెడ్ ఏర్పాటు
- సింగరేణి భవన్, డిసెంబర్ 05, 2025.





**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 5 – ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విజన్ 2047 కు అనుబంధంగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కూడా తన విజన్ 2030-2047 డాక్యుమెంట్ ను ప్రకటించింది. హైదరాబాద్ సింగరేణి భవన్ లో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ శ్రీ ఎన్. బలరామ్ విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసి దానిపై స్ఫూర్తిదాయకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు, వివిధ విభాగాల ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు. సింగరేణి సంస్థ భవిష్యత్తుతో పాటు రాష్ట్ర, దేశ అవసరాలకు అనుగుణంగా కంపెనీని బొగ్గు రంగంతో పాటు ఇతర రంగాల్లోకి పెద్ద ఎత్తున విస్తరింపజేయాలని ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వివిధ రకాల పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి భారీ ఎత్తున ప్రణాళికలు తయారు చేశామని, దేశవిదేశాల్లో కీలక ఖనిజరంగం లో ప్రవేశించడానికి సింగరేణికి అనుబంధంగా గ్లోబల్ సింగరేణి లిమిటెడ్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు, విజన్ డాక్యుమెంట్ లోని స్వల్ప, మధ్యకాలిక ప్రణాళికలో 2030 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న ప్రధాన అంశాలు ఈ విధంగా ఉన్నాయి.

◆ సింగరేణి సంస్థ 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

◆ దీని కోసం ప్రస్తుత లీజు ప్రాంతం లోనే కాక, లీజుకు వెలుపల ఉన్న ప్రాంతంలోని కొత్త బ్లాకులను, వివిధ రాష్ట్రాలలోని కొత్త బ్లాకులను కూడా చేపట్టాలని నిర్ణయించింది.

◆ ప్రస్తుత 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పాదనను 4,400 మెగావాట్లకు పెంచాలని అందుకు అనుగుణంగా కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించింది.

◆ ప్రస్తుతం 245.5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేస్తున్న సింగరేణి సంస్థ 2030 నాటికి 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగా రాజస్థాన్ లో అతి త్వరలోనే 1,500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ను ఏర్పాటు చేయబోతుంది.

◆ రాష్ట్రంలోని పలు భారీ నీటి జలాశయాల పైన 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నది.

◆ ఎత్తైన ఓపెన్ కాస్ట్ డంపుల పైన 100 మెగావాట్ల పవన విద్యుత్తు ఉత్పత్తి కోసం ప్లాంట్లను ఏర్పాటు చేయబోతోంది.

◆ 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్న కంపెనీ తొలి దశలో మూతబడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని వద్ద 250 మెగావాట్ల ప్లాంటును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

◆ మణుగూరుకు సమీపంలోని పగిదేరు వద్ద ప్రయోగాత్మకంగా విజయవంతమైన జియో థర్మల్ ప్లాంటు వద్ద 200 మెగావాట్ల జియో థర్మల్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని, ప్రణాళికలు రూపొందించారు. ఇది కాక ఎఫ్.డి.ఆర్.ఈ హైబ్రిడ్ ఆర్టీసి విభాగాలలో కలిపి మరో 1,500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయాలని, 700 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టంలను వివిధ సోలార్ ప్లాంట్ల వద్ద ఏర్పాటు చేయాలని కూడా ప్రణాళికలు రూపొందించింది. దీనితో మొత్తం మీద 2029 – 30 నాటికి సింగరేణి 5.85 గిగా వాట్ల(5,850 మెగావాట్ల) పునరుత్పాదక విద్యుత్తును ఉత్పత్తి చేయాలని విజన్ డాక్యుమెంట్ లో స్పష్టం చేసింది. సింగరేణి సంస్థ కేవలం బొగ్గు, థర్మల్ విద్యుత్, పవన విద్యుత్, సోలార్ విద్యుత్ రంగాలలోనే కాకుండా కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశించాలని నిర్ణయించిందని, ఈ మేరకు దేశ విదేశాల్లో ఈ రంగంలో గల అవకాశాలను పరిశీలించడం కోసం ప్రఖ్యాత పరిశోధన సంస్థలతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుందని, రాగి, బంగారం అన్వేషణకు లైసెన్స్ కూడా సాధించిందని ఇక ముందు కూడా ఈ రంగంలో దూకుడుగా ముందుకు పోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించడానికి సింగరేణికి అనుబంధంగా గ్లోబల్ సింగరేణి లిమిటెడ్ (జి.ఎస్.ఎల్)అనే అనుబంధ సంస్థ ఏర్పాటు విజన్ డాక్యుమెంట్ లో సూచించారు.

**దీర్ఘకాలిక ప్రణాళిక– విజన్ 2047లో లక్ష్యాలు**

కాగా సింగరేణి సంస్థ తన దీర్ఘకాలిక ప్రణాళిక 2047 లో అవసరమయ్యే థర్మల్ విద్యుత్తును, 5,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును, 2815 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ను, 1,500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను, 500 మెగావాట్ల జియో థర్మల్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని, మొత్తం మీద 25 గిగావాట్ల పరిమాణంలో వివిధ రకాల పునరుత్పాదక విద్యుత్తును ఉత్పత్తి చేయాలని విజన్ డాక్యుమెంట్ లో పేర్కొంది.

**విజన్ డాక్యుమెంట్ లో పేర్కొన్న పలు ఇతర ప్రాధాన్యత అంశాలు**

◆ సింగరేణి రక్షణతో కూడిన ఉత్పాదకత గల ఆధునిక టెక్నాలజీలతో బొగ్గు ఉత్పత్తులు సాధిస్తుంది.

◆ పర్యావరణహిత, మైనింగ్ చేపడుతూ, జల సంరక్షణకు, జీవ వైవిధ్యానికి, వాతావరణ కాలుష్య నివారణకు పాటుపడుతుంది.

◆ పూర్తి పారదర్శకంగా నీతి, నిజాయితీలతో ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకొని మైనింగ్ జరుగుతుంది.

◆ వాతావరణ కాలుష్య నివారణ కోసం కోల్ వాషరీలను ఏర్పాటు చేస్తుంది.

◆ కోల్ గ్యాసిఫికేషన్, లిక్విఫికేషన్ ప్రణాళికలు అమలు చేస్తుంది.

◆ కర్బన ఉద్గారాలను అదుపు చేస్తూ వాటితో ఉపయోగకర పదార్థాలను తయారుచేస్తుంది.

◆ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా సౌర విద్యుత్తు, పవన విద్యుత్తు, ఫ్లోటింగ్ సోలార్ వంటి ప్లాంట్లు ఏర్పాటుచేస్తుంది.

◆ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ రంగంలో ప్రవేశిస్తుంది.

◆ బొగ్గు నుంచి రసాయనాలు, కోల్ గ్యాసిఫికేషన్ ఆధారిత ఉత్పత్తులు సాధిస్తుంది.

◆ మూతపడిన గనుల్లో రిక్లేమేషన్ పనులతో పాటు, అక్కడ ఉన్న నీటి వసతులను పంప్డ్ హైడ్రో ప్రాజెక్టుల కోసం వినియోగిస్తుంది.

◆ మెటల్ మైనింగ్ రంగంలో అన్వేషణ విభాగపు సేవలు అందిస్తుంది.

**అనేక కార్మిక ప్రయోజన, ప్రజాహిత చర్యలు**

◆ నూతన టెక్నాలజీకి అనుగుణంగా ఆటోమేషన్ పద్ధతులకు తగిన విధంగా ఉద్యోగులకు శిక్షణలు ఇవ్వడం.

◆ ఉద్యోగులకు గట్టి ఆరోగ్య రక్షణ, భద్రత , సంక్షేమ కార్యక్రమాలు.

◆ సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాల పెంపుదల.

◆ మహిళా ఉద్యోగుల సేవలను ఓపెన్ కాస్ట్ మరియు భూగర్భగనుల్లోని కీలక విభాగాల్లో వినియోగించడం వంటి చర్యలను విజన్ డాక్యుమెంట్ లో పేర్కొన్నారు.

## వాహనాల తనిఖీ



**చర్ల, డిసెంబర్ 05:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా శనివారం చర్ల మండల తాసిల్దార్ శ్రీనివాస్ మండలంలోని వాహనాలను తనిఖీలు చేశారు .ఈ సందర్భంగా మండల తాసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా ఎవరైనా వాహనాల్లో మద్యం గాని డబ్బులు గానీ తరలించినట్లయితే కఠిన చర్యలు తీసుకోబడతాయని డబ్బులు తీసుకువెళ్లినట్లయితే దానికి తగినటువంటి ఆధారాలు చూపించాల్సిన అవసరం ఉంటుందని ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరూ పాల్పడదని ఎవరైనా పాల్పడినట్లయితే చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. మండల తాసిల్దార్ శ్రీనివాస్ ,పోలీస్ అధికారులు ,ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు హనుమత్ వ్రతం కార్యక్రమం



**చర్ల, డిసెంబర్ 05:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం ఆయిల్ బంక్ ఏరియాలో గల శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవాలయంలో మృగశిర నక్షత్రముతో గల శనివారం మార్గశిర మాసం కావటంతో ఆలయంలో హనుమత్ వ్రతం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. అత్యంత శక్తివంతమైన విశిష్టమైన రోజు కావడంతో భక్తులందరూ మారుతీ నగర్ లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న హనుమత్ వ్రతంలో పాల్గొని అభయాంజనేయ స్వామి వారి కరుణాకటాక్షాలు పొందవలసిందిగా ఆలయ అర్చకులు మంచిరాజు వెంకటేశ్వర శర్మ తెలియజేశారు.

## సీఎంఓ ను కలిసిన ఐఎన్టీయుసీ నేతలు



**ఇల్లందు, డిసెంబర్ 5, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ ) డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ ను శుక్రవారం ఐఎన్టీయుసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఇల్లందు ఐఎన్టీయుసీ ఉపాధ్యక్షుడు, ఐఎన్టీయుసీ సెంట్రల్ జనరల్ సెక్రటరీ గోచికోండ సత్యనారాయణ లు కొత్తగూడెంలో కలిశారు. ఇల్లందు సింగరేణి వైద్యశాలలో మెయిల్ డాక్టర్ ను నియమించాలని అడగడం జరిగిందని, స్పందించిన సియంఓ త్వరలోనే నియమిస్తానని పేర్కొన్నట్లు వారు తెలిపారు.

## చర్ల మండల అభివృద్ధే మా ధ్యేయం

- చర్ల మేజర్ సర్పంచ్ అభ్యర్థి బేతంచెర్ల నర్స వేణి





**చర్ల, డిసెంబర్ 05:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిజెపి సీనియర్ నాయకులు, జనసేన పార్టీ ,తెలంగాణ ఉద్యమకారులు బలపరిచిన చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి బేతంచర్ల నర్సవేణి ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా చేస్తున్నారు. ఈ సందర్భంగా బేతంచెర్ల నర్సవేణి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా చర్ల మండలం అభివృద్ధికి నోచుకోలేదని గతంలో పనిచేసిన వారు ఎవరు చర్ల మండల అభివృద్ధి వైపు ఆలోచనలు చేయలేదని అన్నారు .ఈ సందర్భగా వారు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసే వ్యూహంలో భాగంగా 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి', 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన', రేషన్ బియ్యం పంపిణీ వంటి అభివృద్ధి కార్యక్రమాలను చర్ల మండలంలో విస్తృతంగా ప్రచారం చేస్తూ , గ్రామాల్లోని స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ ఇందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని ప్రజలకు తెలియచేస్తూ, రామ మందిర నిర్మాణం, 'ఆపరేషన్ సింధు' వంటి అంశాలను మండల ప్రజలకు వివరిస్తూ తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. చర్ల మండల అభివృద్ధికి కృషి చేస్తూ మండలాన్ని అభివృద్ధి చేస్తానని గ్రామపంచాయతీ ఎన్నికలలో బేతంచెర్ల నర్సవేణికి ఎన్నికల గుర్తు బ్యాట్ గుర్తు అని మండల ప్రజలు అందరూ తమ అమూల్యమైన ఓటును బ్యాటు గుర్తుపై వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు .

## చివరి రోజు అర్ధరాత్రి వరకు నామినేషన్లు

- బారులు తీరిన అభ్యర్థులు



**గుండాల. ప్రజా జ్యోతి 5** గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ చివరి రోజు కావడంతో అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో రావడంతో నామినేషన్లు అర్ధరాత్రి వరకు జరిగాయి శుక్రవారం గుండాల మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో నాలుగు పంచాయతీల అభ్యర్థులు బారులు తీరడంతో నామినేషన్ల ప్రక్రియ అర్ధరాత్రి వరకు జరిగాయి మండలంలోని 11 గ్రామపంచాయతీలు లలో సర్పంచ్ అభ్యర్థులకు తోడు వార్డు సభ్యులు చివరి రోజు వివిధ పార్టీల నుంచి అధికంగా నామినేషన్లను వేయడానికి రావడంతో ఆలస్యంగా జరిగింది.

## గ్రామపంచాయతీ ఎన్నికల నిబంధనలు పాటించాలి

- పాల్వంచ డీఎస్పీ సూచనలు.
- కోడిపుంజుల వాగు గ్రామంలో అభ్యర్థులతో పోలీసు శాఖ అవగాహన సమావేశం.



**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 05(ప్రజా జ్యోతి ):** పాల్వంచ మండలంలోని కోడి పుంజుల వాగు గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్ కుమార్,సీఐ కే.సతీష్ హాజరై కీలక సూచనలు చేశారు.రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా, హింసాహింసలు లేకుండా సాగాలంటే ప్రతి అభ్యర్థి,గ్రామస్తులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ సతీష్ కుమార్ సూచించారు.ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు,గుంపుల రాజకీయాలు లేదా చట్టవిరుద్ధ చర్యలకు అవకాశం ఇవ్వకుండా పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు.సీఐ సతీష్ మాట్లాడుతూ,ప్రచారం, నామినేషన్,పోలింగ్,ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పూర్తిగా పాటించాలని,శాంతి భద్రతలను భంగం చేసే చర్యలు చేపడితే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్,వార్డు మెంబర్ అభ్యర్థులు,గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్నికల నిబంధనలపై అవగాహన పొందారు.

## భవిష్య హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో భోజనం పంపిణీ

**కొత్తగూడెం,డిసెంబర్ 5 (ప్రజాజ్యోతి):** భవిష్య హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద యాచకులకు శుక్రవారం ఆహార పొట్లాలను భవిష్య, పరిణితి, యామిని, చేతుల మీదుగా పంపిణీ చేశారు. వీరి మిత్ర బృందం భార్గవ్, కిరణ్, సురేష్, అరుణ్, చందు, సంపత్ గత కొన్ని నెలల నుంచి, ప్రతినెల రెండు సార్లు ఆహార పొట్లను స్వయంగా సిద్ధం చేసి వారి పిల్లల చేతుల మీదుగా పంపిణీ చేస్తూ యాచకుల ఆకలిని తీరుస్తూ పలువురి ప్రశంసలను అందుకుంటున్నారు.



# ఓసీ గనుల్లో మహిళా ఆపరేటర్లకు అద్భుత అవకాశం

- ఈపీ ఆపరేటర్లుగా ఎంపికకు సర్టిఫికెట్ల ధృవీకరణ, ఇంటర్వ్యూల నిర్వహణ





**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 5 – ప్రజాజ్యోతి:** సింగరేణిలో ఓపెన్ కాస్ట్ గనుల్లో కూడా మహిళా కార్మికులకు అవకాశం కల్పించాలన్న సీఎండీ ఎన్.బలరామ్ ఆలోచన మేరకు సంస్థలో ప్రస్తుతం జనరల్ అసిస్టెంట్ గా లేదా బదిలీ వర్కర్లుగా పనిచేస్తున్న మహిళలకు సింగరేణి యాజమాన్యం తొలిసారిగా ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పని చేయడానికి అవకాశం కల్పిస్తోంది. ఇటీవలనే దరఖాస్తులకు ప్రకటన చేయగా మొత్తం 43 మంది మహిళా కార్మికులు దరఖాస్తు చేశారు. వీరిలో ఇంటర్వ్యూలకు 35 మంది హాజరయ్యారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఎంపిక కమిటీ సభ్యులు జీఎం (సీపీపీ) ఏ.మనోహర్, జీఎం (పర్సనల్) ఐఆర్ & పిఎం కవితా నాయుడు, జీఎం (ఓసీపీ) పి.ఎలిషా, సీఎంఓ ఆర్.కిరణ్ రాజ్ కుమార్, జీఎం (హెచ్ఆర్డి) ఆర్.విజయ ప్రసాద్, జీ ఎం (ఎంఎస్) బొజ్జా రవి మహిళా అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు.ఈ సంధర్భముగా వారు మాట్లాడుతూ... సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరక్టర్ ఆదేశాల మేరకు మహిళలు ఏ రంగంలోనైనా పురుషులతో సమానంగా పనిచేయగలరు అనే ఉద్దేశం తో ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పనిచేడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించటం జరిగిందని ఇది ఒక గొప్ప అవకాశం కనుక ఎంపికైన అభ్యర్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన అనంతరం ఇంటర్వ్యూ లు నిర్వహించారు. ఎంపికైన మహిళా అభ్యర్థులకు మెడికల్ టెస్టుల అనంతరం సిరిసిల్లలో గల తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ సంస్థ హెవీ గూడ్స్ వెహికల్ / హెవీ మోటార్ వెహికల్ విభాగంలో 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఖాళీల లభ్యతను బట్టి ఈపీ ఆపరేటర్ ట్రైనీ కేటగిరి–5 డిసిగ్నేషన్ తో పోస్టింగ్ ఇవ్వబడుతుందని అధికారులు తెలిపారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో మహిళలకు భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పనిచేసే అవకాశం సంస్థ ఛైర్మన్ చొరవతో సింగరేణి చరిత్రలో తొలి సారి కల్పించబడిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు కంపెనీ అభివృద్ధి కి కూడా పాటుపడాలని కోరారు.

## వనవాసీపరిషత్ కు రిఫ్రిజరేటర్ వితరణ



**చర్ల, డిసెంబరు 05: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం వనవాసి పరిషత్ కు చర్లకు చెందిన ఆదర్శ రైతు జవ్వాది జయకుమార్ (జయబ్బాయి) సతీమణి జవ్వాది సాయిలక్ష్మి నాలుగవ వర్ధంతి సందర్భంగా వనవాసీ కొమరం భీం విద్యార్ధి నిలయంకు వారి కుమారులు వెంకటేశ్వరబాబు, నరేంద్ర బాబు, రవికుమార్, సత్యనారాయణ, మురళీకృష్ణ లు రిఫ్రిజరేటర్, విద్యార్దులకు భోజన ఏర్పాట్లు, స్వీట్స్, పండ్లను అందచేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బివిఎస్ఎల్ నరసింహారావు పాల్గొని మాట్లాడుతూ జయకుమార్ –సాయిలక్ష్మి దంపతులు అనేక మంది పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందచేసి వారి ఉన్నతికి తోడ్పడ్డారని పేర్కొన్నారు. ఈ దంపతుల సహకారంతో అనేక మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు గా స్దిరపడ్డారని గుర్తుచేసారు. తల్లిదండ్రులు అందించిన స్ఫూర్తిని పునికిపుచ్చుకొని కుమారులు అదేబాటలో పయనించడం అబినందనీయమని పేర్కొన్నారు. ఆర్ధిక సహాయం చేసే సామర్ధ్యం ఉన్నా అనేక మంది ముందుకు రావడం లేదని జయకుమార్ కుమారులు వనవాసీ సంస్థతో పాటు ఇతర అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. గోదావరి వరదల సమయంలో సర్వస్వం కోల్పోయిన బాదితులకు రూ. లక్ష విలువచేసే గిన్నెలు, ఇతర సామగ్రి అందచేసి మానవత్వం చాటుకున్నారని గుర్తుచేసారు. భద్రాచలం డివిజన్ లో ఎవరూ చేయని విదంగా పలు గిరిజన గ్రామాలకు చెందిన 40 మందికి పైగా ఆదివాసీ గర్బిణి స్త్రీలకు సామూహిక శ్రీమంతాల కార్యక్రమం చేపట్టి గొప్ప వరవడికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. వనవాసీ సంస్దకు వితరణలను అందించడంలో జవ్వాది కుటుంబానిదే అగ్రస్దానమని పేర్కొన్నారు. ఎంతో విలువైన భూమిని సంస్దకు ఇవ్వడమే కాకుండా విద్యార్దుల అవసరాలను గుర్తించి పరుపులు, ట్రంక్ పెట్టెలు, కన్వర్టర్, బ్యాటరీ, భోజన సదుపాయాలు, విద్యార్దులకు అవసరమైన దుస్తులను పంపిణీ చేసి దాతృత్వం చాటుకున్నారని అన్నారు. వనవాసీ ప్రాంత మహిళా సహప్రముఖ్ పెద్దాడ ఆశాలత, గురుదేవ్ విద్యాలయం ప్రిన్సిపాల్ హెచ్ జి వి ప్రసాద్, ఎకడమిక్ కో ఆర్డి నేటర్ మల్లాది సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న జవ్వాది కుటుంబ సభ్యులను అబినందించారు. విద్యార్థులు ఇటువంటి దాతల స్ఫూర్తితో ముందుకు సాగుతూ ఉన్నత చదువులను చదవాలని విజ్ఞప్తి చేసారు. ఎటువంటి సౌకర్యాలు లేని మారుమూల ప్రాంతాలకు చెందిన విద్యార్దులకు వారి అవసరాలకు అనుగుణంగా కావాల్సిన వస్తువులను సమకూర్చడం సంతోషకరమని అన్నారు. విద్యార్దులు ఇటువంటి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్దితికి చేరుకోవాలని సూచించారు. జవ్వాది కుటుంబ సభ్యులు, విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయులు నరేంద్ర బాబు మాట్లాడుతూ ఆదివాసీ విద్యార్దుల అభ్యున్నతికి కృషిచేస్తున్న వనవాసీ సేవలు అమోఘమని పేర్కొన్నారు. వీరు అందచేస్తున్న స్ఫూర్తితో తమవంతు సహాయంగా సంస్దకు తమ కుటుంబం సహకారమందిస్తాం దని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగిఉండి విద్యార్దుల చదువులకు తోడ్పాటునందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జవ్వాది కుటుంబ సభ్యులు జవ్వాది రవికుమార్, జవ్వాది మురళీకృష్ణ, జవ్వాది శ్రీనివాసరావు, పామర్తి కౌశిక్, వనవాసీ జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు, కొమరం భీం విద్యార్ధి నిలయ కమిటి అధ్యక్షుడు తాటి పాపారావు, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, బందా స్వరూప రాణి, లవన్ కుమార్ రెడ్డి, పాశికంటి శ్రీదేవి, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

## బరిలో నిలిచేదెవరో...

- ముగిసిన నామినేషన్లు.

**గుండాల. ప్రజా జ్యోతి 5.** గుండాల మండలంలో నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో బరిలో ఎవరుంటారు ఎవరిపై ఎవరు గెలుస్తారని చర్చ రూపొందుకుం ది గుండాల మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ న్యూ డెమోక్రసీ బిఆర్ఎస్ మాస్ లైన్ సిపిఐ సిపిఎం తుడుం దెబ్బ నుండి వివిధ గ్రామపంచాయతీలలో అభ్యర్థులను నిలబెట్టుకున్నారు కాగా నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో పొత్తులపై పార్టీలు చర్చలు జరుపుకుంటుండగా బలబలాలపై అంచనా వేసుకుంటూ అభ్యర్థులను బరిలో ఎవరిని ఉంచాలో ఎవరిని తీయాలో అన్న ఆలోచనలు పార్టీలు పావులు కదుపుతున్నాయి గుండాల మండలంలో 11 గ్రామ పంచాయతీలలో గుండాల గ్రామపంచాయతీ పై అన్ని పార్టీలు దృష్టి సాదించాయి మండల కేంద్రం కావడంతో మండల కేంద్రంలోని గ్రామపంచాయతీని గెలిపించుకోవడం కోసం ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి గుండాల గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ నుండి వాంకుడోత్ బికోజి న్యూ డెమోక్రసీ నుండి కోరం సీతారాములు మాస్ లైన్ నుండి ఈసం శంకర్ బి ఆర్ ఎస్ పార్టీ నుండి పొందైన సుధాకర్ పాత కాంగ్రెస్ నుండి ఈసం పాపారావు రామకృష్ణ నామినేషన్లు వేయగా ముత్తాపురం గ్రామపంచాయతీ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ నుండి ఎట్టి సుశీల న్యూ డెమోక్రసీ నుండి పూనం సౌజన్య టిఆర్ఎస్ పార్టీ నుండి మోకలి శ్రీదేవి మాస్ లైన్ నుండి పూణెం రమాదేవి నామినేషన్ దాఖలు చేయగా కాచనాపల్లి గ్రామపంచాయతీ లో న్యూ డెమోక్రసీ నుండి జరుపుల కిషన్ కాంగ్రెస్ పార్టీ నుండి బోడ వెంకట్రావు మాస్ లైన్ నుండి బుర్ర వెంకన్న నామినేషన్ వేశారు పడుకొని గూడెం గ్రామపంచాయతీ లో కాంగ్రెస్ పార్టీ నుండి సంజీవరావు న్యూడెమోక్రసీ పార్టీ నుండి పరిషత్ రవి మాస్ లైన్ నుండి కొట్టం కృష్ణయ్య సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ వేశారు సాయనపల్లి గ్రామపంచాయతీ నుండి కాంగ్రెస్ నుండి కృష్ణవేణి టిఆర్ఎస్ నుండి టి మౌనిక ఆదివాస సంక్షేమ పరిషత్ న్యూ డెమోక్రసీ పార్టీల అభ్యర్థి వాగబోయిన దామర్ తోవు గ్రామపంచాయతీ లో కాంగ్రెస్ పార్టీ నుండి రమేష్ టిఆర్ఎస్ పార్టీ నుండి బుచ్చి రాములు నామినేషన్లు వేయగా శెట్టిపల్లి గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ నుండి ఢిల్లీ వసంతరావు న్యూ డెమోక్రసీ నుండి ఇర్ప రాజేష్ డిఆర్ఎస్ పార్టీ నుండి సుధాకర్ లు నామినేషన్లు వేశారు శంభుని గూడెం గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ నుండి యశోద న్యూడెమోక్రసీ నుండి అశ్విని బిఆర్ఎస్ పార్టీ నుండి లక్ష్మీకాంతం నామినేషన్లు వేశారు రోల్లగడ్డ గ్రామపంచాయతీలో న్యూ డెమోక్రసీ నుండి విజయ కాంగ్రెస్ పార్టీ నుండి చింతా నగేష్ బీఆర్ఎస్ పార్టీ నుండి మంగమ్మ నామినేషన్ వేయగా లింగగూడెం గ్రామపంచాయతీ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా కుంజా కృష్ణ న్యూ డెమోక్రసీ అభ్యర్థిగా పాయం ఎల్లన్న టిఆర్ఎస్ పార్టీ నుండి కుంజ సుధాకర్ తుడుం దెబ్బ నుండి చింత వెంకటేశ్వర్లు నామినేషన్లు వేశారు.

# సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకై అంకితభావంతో పనిచేయాలి

- కొత్వాల శ్రీనివాసరావు



**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 05(ప్రజా జ్యోతి):** ఈ నెల 14న జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పార్టీ అభ్యర్థుల విజయం కోసం అంకితభావంతో కృషి చేయాలని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్,డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.శుక్రవారం పాల్వంచ అయ్యప్పనగర్‌లోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి సాధ్యమని పేర్కొన్నారు.రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలైన 2 లక్షల రైతు రుణమాఫీ, ఎకరానికి 12,000 రూపాయల రైతు భరోసా, రైతుబంధు బీమా,సన్నధాన్యానికి క్వింటాకు 500 రూపాయల బోనస్ వంటి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అలాగే మహిళలకు ఉచిత రవాణా, 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్,రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాలే జానకి రెడ్డి,మాజీ జడ్పిటిసి సభ్యులు ఎర్రంశెట్టి ముత్తయ్య, మండల,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న గౌడ్,నూకల రంగారావు,పెద్దమ్మగుడి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ఆర్టీఏ మెంబర్ బాదర్ల జోషి, నాయకులు మహిపతి రామలింగం, బద్ది కిషోర్,సాధం రామకృష్ణారావు, కాపర్తి వెంకటాచారి,పైడిపల్లి మహేష్, ఉండేటి శాంతివర్ధన్,వై. వెంకటేశ్వర్లు, తుమ్మల శివారెడ్డి,కొమరరాజు విజయ్,పిట్టల రాము,షేక్ చాంద్ పాషా,డిష్ నాగేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వర్లు,ఆవుల మధు, వాసుమల్ల సుందర్రావు,సాంబయ్య, కటుకూరి శేఖర్,కొత్తపల్లి రవి, ధర్మసోత్ ఉపేందర్,అలెక్స్,నాయక్, అశోక్, బండి నాగరాజు,స్క భాషా, చింతలచెరువు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మూడు ఐఈడి బాంబుల నిర్వీర్యం



**చర్ల, డిసెంబర్ 05: (ప్రజా జ్యోతి ):** తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ నారాయణపూర్ చొటేదొంగర్ ప్రాంతంలోని అత్యంత సున్నితమైన అడవులలో భద్రతా దళాలు గురువారం ఒక ప్రధాన ఆపరేషన్ నిర్వహించాయి. నక్సలైట్లు అమర్చిన మూడు ఐ ఈ డి బాంబులను సైనికులు స్వాధీనం చేసుకుని సురక్షితంగా నిర్వీర్యం చేశారు.పోలీసులకు హాని కలిగించాలని నక్సలైట్లు మూడు ఐ ఈ డి బాంబులను అమర్చారు. మదీన్ నది ఒడ్డున ఉన్న పద్బెడ ఫుట్‌పాత్‌పై నక్సలైట్లు ఐ ఈ డి లను అమర్చారని భద్రతా దళాలకు సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే, ఉమ్మడి ఆపరేషన్‌కు ప్రణాళికలో భాగంగా ఓర్చాలోని ఐ టి బి పీ యొక్క 29వ బెటాలియన్, బాంబు నిర్వీర్య దళం నారాయణపూర్, చోటే డోంగర్ పోలీస్ స్టేషన్ పోలీసు దళం, ఐ టి బి పీ డాగ్ స్క్వాడ్ ఈ ఉమ్మడి బృందంలో ఉన్నాయి. భద్రతా దళాల సంయుక్త బృందం సంఘటనా స్థలానికి చేరుకుని, మూడు ఐ ఈ డి బాంబులను స్వాధీనం చేసుకుని వాటిని సురక్షితంగా నాశనం చేసింది.

# ఎన్నికలను సజావుగా నిర్వహించుకుందాం

- కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్



**కొత్తగూడెం, డిసెంబర్ 5(ప్రజా జ్యోతి):** పంచాయతీ ఎన్నికలు నిష్పక్షపాతంగా, శాంతియుతంగా జరగడానికి పోలీసులు అన్ని చర్యలు తీసుకున్నారని కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ అన్నారు.రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శుక్రవారం కొత్తగూడెం టూ టౌన్ ఇన్స్పెక్టర్ డి. ప్రతాప్ ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలం రుద్రంపూర్ పంచాయతీ సంత మైదానంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఎన్నికల నియమావళి, శాంతిభద్రతల ఏర్పాట్లు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు వంటి ముఖ్య అంశాలపై ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు, కార్యకర్తలు చట్టాలను పూర్తిగా పాటించాలని, ప్రజలను ప్రలోభపెట్టే చర్యలు, హింసాత్మక ఘటనలు ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.ఇన్స్పెక్టర్ డి. ప్రతాప్ మాట్లాడుతూ, ప్రచార ర్యాలీలు, మోటార్ సైకిల్ ర్యాలీలు, ధ్వనివాహనాల వినియోగం వంటి వాటికి సంబంధించి ఎన్నికల సంఘం నిర్ణయించిన మార్గదర్శకాలు అందరూ పాటించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల కోసం అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టూ టౌన్ పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ మనీషా, ఎమ్మార్పీఎస్ నాయకులు కొంకటి కృష్ణ, తోట రాజు, సలిగంటి శ్రీనివాస్, అబ్దుల్ ఉమర్, మురాద్, బానోత్ కేస్లీ, కురుస పద్మ, గూడెల్లి యాకయ్య, ఎన్. డి రవితేజ, నిమ్మల సాగర్, గాదం రమేష్, నాంపల్లి రాజేష్ ,సర్పంచ్ అభ్యర్థులు, వార్డ్ మెంబర్ అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాధాకృష్ణ దేవాలయంలో అయ్యప్ప పీఠం

- నేడు మహా పడిపూజ
- భక్తులతో పాల్గొనమని సమితి విజ్ఞప్తి.



**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 05(ప్రజా జ్యోతి):** కేటీపీస్ ఏ-కాలోనీ లోని శ్రీ రుక్మిణి రాధాకృష్ణ దేవాలయంలో, శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో గురుస్వామి బి వి ఆర్ నేతృత్వంలో అయ్యప్ప పీఠం ఏర్పాటుచేయబడింది.ఈ పీఠం వద్ద ప్రతిరోజూ ఉదయం,సాయంత్రం అయ్యప్ప స్వామివారి పూజలు నిర్వహించబడుతున్నాయి.పూజల అనంతరం భక్తులకు తీర్థ–ప్రసాదాలు అందిస్తున్నారు.ఈ పీఠంలో 74 మంది అయ్యప్ప స్వాములు ప్రతిరోజూ సకాలంలో హాజరై భజనలు,పూజలు విధివిధానాలతో ఆచరిస్తున్నారు. స్వాములకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమితి సభ్యులు భోజన సదుపాయాలను కూడా ప్రతిరోజూ ఏర్పాటు చేస్తున్నారు.ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో నిర్వహించే స్వామివారికి అత్యంత ప్రియమైన "పడిపూజ" ఈ ఏడాది కూడా భక్తిశ్రద్ధలతో జరగనుంది.డిసెంబర్ 6వ తేదీ సాయంత్రం 6:30 గంటలకు మహా పడిపూజ నిర్వహించడానికి సమితి సభ్యులు ముహూర్తం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

**కార్యక్రమ నిర్వాహకులు:** బి వి ఆర్ గురుస్వామి,చెరుకు అశోక్ గురుస్వామి,కందుకూరి శ్రీనివాస్ గురుస్వామి,హరి రమేష్ గురుస్వామి,రాంబాబు గురుస్వామి, చెరుకు అయోధ్య గురుస్వామి, కేశబోయిన కోటేశ్వరరావు గురుస్వామి,పిట్ట వెంకటరెడ్డి గురుస్వామి,తూముల లక్ష్మణ్ గురుస్వామి,కొండ అశోక్ స్వామి, ధర్మరాజు శ్రీను స్వామి,దేహబలంద స్వామి,చెరుకు డీల్లు సత్యరామ్ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# 16 వ వార్డు అభ్యర్థి కవిత వార్డులో జోరుగా విస్తృత ప్రచారం

- నన్ను గెలిపించండి వార్డు అభివృద్ధి చేసి చూపిస్తా
- అభ్యర్థి రత్నం కవిత



**భద్రాచలం టౌన్ డిసెంబర్ 5( ప్రజా జ్యోతి )** భద్రాచలం గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన రత్నం కవిత శుక్రవారం 16వ వార్డులో విస్తృత ప్రచారాన్ని సాగించారు. ఈ సందర్భంగా రత్నం కవిత మాట్లాడుతూ ఈలా గుర్తుపై ఓటు వేసి అఖండ విజయంతో గెలుపొందించినట్లయితే వార్డుని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని, సిమెంట్ రోడ్డు లేని వీధిలో నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు సజావుగా నిర్వహణ డ్రైనేజి వ్యవస్థ లోపాల సవరణ,పరిశుభ్రత–పారిశుద్ధ్యం, అవినీతి ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో పేదలకు సంపూర్ణ సహకారం విషయాల్లో సంపూర్ణ సహకారం అందిస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 16 వార్డు అభ్యర్థిని నన్ను అఖండ మెజారిటీ తోటి గెలిపించాలని రత్నం కవిత కోరుకున్నారు.

# బస్సు ఢీకొని మహిళ మృతి





**ఇల్లందు టౌన్, డిసెంబర్ 5, ప్రజాజ్యోతి:** పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద ఓ ప్రైవేటు బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన శుక్రవారం రాత్రి జరిగింది. మండలంలోని సిఎస్పీ బస్తీకి చెందిన రహీముద్దీన్– సుహాన దంపతుల కుమార్తె జాస్మిన్ జ్వరం రావడంతో ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు. వారి కుమార్తెకు చపాతీలు తీసుకొచ్చేందుకు ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో ప్రైవేటు బస్సు క్రిందపడి ఎండి సుహానా (40) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

- ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో స్థానిక ఎన్నికలు జరుపుకోవాలి... పింగళి నాగరాజు,సర్కిల్ ఇన్స్పెక్టర్



**అశ్వారావుపేట, డిసెంబర్ 05,ప్రజాజ్యోతి :** ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో స్థానిక ఎన్నికలు జరుపుకోవాలని, ఎన్నికలలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అశ్వారావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పింగళి నాగరాజు అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న ఉట్లపల్లి, వేదాంతపురం, గాండ్లగూడెం, అనంతారం గ్రామపంచాయతీలలో ఎన్నికల నియమావళిపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నాగరాజు మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిష్పక్షపాతంగా శాంతియుతంగా ఎన్నికలు జరిగే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఓటర్ల పై ఒత్తిడి తెస్తూ, మద్యం పంపిణీ, నగదు పంపిణీ అంటూ ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమాలు, నిబంధనలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ లు యాయాతి రాజు అఖిల పలువురు పోలీస్ సిబ్బంది, యువత, మహిళ, స్వయం సహాయక సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి



**ఇల్లందు, డిసెంబర్ 5, ప్రజాజ్యోతి:** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించాలని ఐఎన్టియుసి ఇల్లందు ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మండలంలోని ఇందిరానగర్, బాలాజీ నగర్ పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించాలని ఐఎన్టియుసి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఓటర్లు ఆలోచించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## కొత్త అంజనాపురం గ్రామంలో యువ శక్తి రంగ ప్రవేశం

- స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా బానోత్ హతిరాం నామినేషన్



**సుజాతనగర్, డిసెంబర్ 05, ప్రజా జ్యోతి :** రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో సుజాతనగర్ మండలం కొత్త అంజనాపురం రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఈ నేపథ్యంలో యువ నాయకుడు బానోత్ హతిరాం గురువారం నాడు స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా తన నామినేషన్‌ను దాఖలు చేశారు. యువకుడిగా, గ్రామీణ రాజకీయాలపై సరైన అవగాహన, గ్రామ సమస్యలపై ప్రత్యక్ష అనుభవం ఉన్న వ్యక్తిగా హతిరాం ఇప్పటికే ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. గ్రామంలో తాను ఎప్పటి నుంచో ప్రజా సమస్యలపై ముందుండి పనిచేస్తూ వచ్చినందున, ఆయన నామినేషన్‌పై గ్రామస్థుల్లో ఆసక్తి మరింత పెరిగింది. స్వతంత్ర అభ్యర్థిగా రంగప్రవేశం చేసిన హతిరాం పట్ల యువతలో ప్రత్యేకంగా ఉత్సాహం కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామానికి ఒక నిష్పక్షపాత నాయకత్వం అవసరమని, కొత్త ఆలోచనలతో పనిచేసే వ్యక్తి ముందుకు రావాలని కోరుకున్న ప్రజల అభిమతానికి ఆయన అభ్యర్థిత్వం సరిపోతుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. గురువారం నామినేషన్ సందర్భంగా ఆయన అనుచరులు, గ్రామ పెద్దలు, యువకులు బరిలోకి వచ్చిన ఆతనికి మద్దతు ప్రకటించారు. గ్రామ అభివృద్ధి, పారదర్శకత, పంచాయతీ పనుల్లో నిబద్ధత.. ఇవన్నీ తన లక్ష్యాలని బానోత్ హతిరాం ఈ సందర్భంగా వెల్లడించారు. ఇక ఈ నామినేషన్ దాఖలుతో కొత్త అంజనాపురం గ్రామంలో ఎన్నికల పోటీ మరింత ఆసక్తికర మలుపు తిరిగింది.

## నామినేషన్లను పరిశీలించిన జనరల్ అబ్జర్వర్



**ఇల్లందు, డిసెంబర్ 5, ప్రజాజ్యోతి:** మండలంలోని సుదిమళ్ళ, సుభాష్‌నగర్, తిలక్ నగర్, రొంపేడు గ్రామ పంచాయతీల నామినేషన్ల ప్రక్రియను శుక్రవారం గ్రామపంచాయతీ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ సర్వేష్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యంపీడిఓ దన్ సింగ్, యంపీఓ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సాయుధ దళాల దినోత్సవం

- సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా పతాక నిధికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తొలి విరాళం



**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 5, ప్రజా జ్యోతి**

కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో కలెక్టర్ సాయుధ దళాల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా సాయుధ దళాల పతాక నిధి కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ కలెక్టర్ తొలి విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న సైనికుల కోసం పతాక నిధికి ప్రతి పౌరుడు తన వంతు సహకారం అందించడం దేశభక్తి, సామాజిక బాధ్యతకు ప్రతీక అని తెలిపారు. సరిహద్దుల్లో ప్రతికూల పరిస్థితుల్లో సేవలు అందిస్తున్న భారత సైన్యం, నౌకాదళం, వాయుసేన సిబ్బంది త్యాగాలను ప్రతి భారతీయుడు గౌరవించాలని అన్నారు. వీరి కుటుంబాల సంక్షేమం కోసం పతాక నిధి వినియోగించబడుతుందని పేర్కొంటూ జిల్లా ప్రజలు, విద్యాసంస్థలు, పారిశ్రామిక వర్గాలు, వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ల కుటుంబాల పట్ల సమాజం అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. పతాక నిధి ద్వారా వీరమరణం పొందిన సైనికుల కుటుంబాలకు, సేవలలో గాయపడిన రక్షణ సిబ్బందికి ఆర్థిక సహాయం అందించబడుతుందని వివరించారు. ప్రతి సంవత్సరం సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా ఈ నిధి సేకరణ ద్వారా దేశ రక్షణ వ్యవస్థ పట్ల ప్రజల సమగ్రత, ఐక్యత మరింత బలపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి ఎం చంద్రశేఖర్, వింగ్ కమాండర్ రిటైర్డ్ సురేందర్, ఆర్మీ రిటైర్డ్ సుభాని, కృష్ణమూర్తి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కోయగూడెం బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిపై కాంగ్రెస్ నాయకుల దాడి

- వార్డు మెంబెర్ల నామినేషన్ వేయకుండా పత్రాలు ఎత్తుకెళ్లిన కాంగ్రెస్ నాయకులు
- నామినేషన్ వేస్తే అంతు చూస్తామంటూ కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్ బెదిరింపు, దాడి
- చర్యలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పోలీసులకు ఫిర్యాదు





**టేకులపల్లి, డిసెంబర్ 5, ప్రజాజ్యోతి:** మండలంలోని కోయగూడెం గ్రామపంచాయతీ బిఆర్ఎస్ అభ్యర్థి పూనెం కరుణాకర్ పై కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, అతని భార్య ఉమా దాడి చేశారంటూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పోలీసులకు బిఆర్ఎస్ అభ్యర్థి పూనెం కరుణాకర్ ఫిర్యాదు చేశారు. బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి పూనెం కరుణాకర్ ఫిర్యాదు వివరాల ప్రకారం కోయగూడెం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న క్రమంలో తనతోపాటు వచ్చిన వార్డు మెంబర్లను సైతం బెదిరించి నామినేషన్ పత్రాలను ఎత్తుకెళ్లారని ఆరోపించారు. నామినేషన్ వేస్తే గ్రామంలో ఉండనివ్వమని బెదిరింపులకు పాల్పడ్డట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా క్యూ లైన్ లో ఉన్న వార్డు అభ్యర్థులను వెళ్ళగొట్టారని, లోపల ఉన్న తనను బయటకు రాకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. కోయగూడెం పంచాయతీ సమస్యాత్మకమైందని అధికారులు గుర్తించినప్పటికీ అక్కడ తగిన పోలీస్ బందోబస్తు కానీ, సీసీ కెమెరాలు కానీ ఏర్పాటు చేయలేదని వాపోయాడు. తనకు తన అభ్యర్థులకు ప్రాణభయం ఉందని దీనిపై ఎన్నికల కమిషన్, పోలీసులు తక్షణమే స్పందించి రక్షణ కల్పించాలని, తమపై దాడికి పాల్పడి నామినేషన్ పత్రాలను ఎత్తుకెళ్లిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## రేగళ్ల నామినేషన్ కేంద్రాన్ని, సర్వేలేయన్స్ చెక్ పోస్టును సందర్శించిన: ఎస్పీ





**కొత్తగూడెం, డిసెంబర్ 5 (ప్రజాజ్యోతి):** పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి ప్రకారం జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పరిశీలించారు. రేగళ్ల గ్రామంలోని పంచాయతీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ విధులలో ఉన్న పోలీస్ అధికారులు, ఎన్నికల అధికారులను నామినేషన్ ప్రక్రియ సరళిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న స్టాటిక్ సర్వేలేయన్స్ చెక్పోస్టును సందర్శించారు. అక్కడ వాహన తనిఖీల వివరాల రిజిస్టర్ ను ఎస్పీ తనిఖీ చేశారు. ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా నగదు, మద్యం, మరే ఇతర వస్తువులను అక్రమ రవాణాకు ప్రయత్నించే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, అట్టి వాహనాల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని, జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని చెక్పోస్టుల వద్ద నిత్యం వాహన తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రిలో భారీ ఆపరేషన్.....

- పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా మాఫియా బహిర్గతం
- జిపిఎస్ మార్పిడి నకిలీ ఎంట్రీలు
- 300 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం మళ్లింపు గుట్టురట్టు
- పిడిఎస్ బియ్యం మాఫియా రింగ్ పై విజిలెన్స్ దాడులు
- లక్షల్లో ప్రభుత్వానికి నష్టం
- పిడిఎస్ బియ్యం మాఫియాలో పాల్వంచకు చెందిన పలువురు డీలర్లు?






**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 5, ప్రజా జ్యోతి:** :భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్ వివరాలను జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ శుక్రవారం జరిగిన పాత్రికేయ సమావేశంలో వెల్లడించారు.విశ్వసనీయ సమాచారంతో తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ టాస్క్ ఫోర్స్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారులు డిసెంబర్ 2న పాల్వంచ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిఘా ఏర్పాటు చేశారు.

**జిపిఎస్ మార్పిడి –నకిలీ ఎంట్రీలతో భారీ మోసం.**

సాయంత్రం 4: గంటల సమయంలో బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్పై వచ్చిన యువకుడు స్టాక్ పాయింట్ సిబ్బందికి పత్రాలు అందజేయడం అనుమానాస్పదంగా కనిపించడంతో,అతడిని ఆపి విచారించారు.అతడి పేరు ప్రసాంత్ అని, స్టేజ్–I కాంట్రాక్టర్ ఎన్. శ్రీనివాస్కు అసిస్టెంట్గా పనిచేస్తున్నట్లు తెలిపాడు.ప్రసాంత్ వాంగ్మూలం ప్రకారం, వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామ్ నుండి రావాల్సిన పిడిఎస్ సన్నబియ్యాన్ని జిపిఎస్ ట్రాకింగ్ వ్యవస్థను మార్చి,లారీ నం.TS29T 5139 యొక్క ట్రక్ చిట్ నంబర్ 4346తో కలిసి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నకిలీ ఎంట్రీలు చేసి తిరిగి మళ్లించారని అధికారులు తెలిపారు.దీంతో అసలు లారీ లోడ్ అయిన 600 సంచుల (300 క్వింటాళ్ల) పిడిఎస్ బియ్యం నల్లబజారుకు మళ్లించినట్లు బయటపడింది.

**స్టేజ్–I కాంట్రాక్టర్,రైస్ మిల్లర్ ప్రమేయం బయటపడింది.**

అనంతరం దర్యాప్తులో స్టేజ్–I కాంట్రాక్టర్ ఎన్.శ్రీనివాస్ను అదుపులోకి తీసుకున్నారు.ఆయన తన భార్య పేరుతో కాంట్రాక్టర్గా పనిచేస్తూ,మణుగూరు రైస్ మిల్లర్ నరహరి (ఎం/స్ రమ్యా రైస్ ట్రేడర్స్) సహకారంతో ప్రతి లారీకి రూ.50,000 చొప్పున జి పి ఎస్ మార్పిడి ద్వారా ఐదు సార్లు పిడిఎస్ బియ్యం మళ్లించినట్లు ఒప్పుకున్నారు. లారీ డ్రైవర్ అనిల్ కుమార్ను నగిరిపేట అవుట్స్కర్ట్స్లో అరెస్ట్ చేసి,లారీని స్వాధీనం చేసుకున్నారు. పంచనామా ద్వారా పిడిఎస్ బియ్యం రికవరీ చేశారు.

**ఎంఎల్ఎస్ సిబ్బంది,పిడిఎస్ డీలర్ల ప్రమేయం నిర్ధారణ:**

ఎంఎల్ఎస్ ఇన్చార్జ్ సత్యవతి,డేటా ఎంట్రీ ఆపరేటర్ కృష్ణకుమార్, హమాలి నాగరాజుతో కలసి నకిలీ ఎంట్రీలు చేసి,పిడిఎస్ డీలర్ల ఒత్తిడితో బయోమెట్రిక్ సంతకాలు తీసి అసలు సరుకును ఇవ్వకుండా మోసం చేసినట్లు విచారణలో బయటపడింది.నకిలీ రసీదుల కోసం లంచాలు కూడా స్వీకరించినట్లు తేలింది.

**చట్టపరమైన కేసులు – కఠిన చర్యలు:**



దర్యాప్తులో పిడిఎస్ బియ్యం మాఫియా రింగ్ భారీ స్థాయిలో ప్రభుత్వానికి నష్టం కలిగించినట్లు నిర్ధారించారు.నిందితులపై క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్,మోసం,మిస్చీఫ్, క్రిమినల్ కుట్ర (బిఎన్ఎస్ సెక్షన్లు 316(5),324(3),318(5),61(2) బిఎన్ఎస్) కింద కేసులు నమోదు చేశారు.అదేవిధంగా ఎస్సెన్షియల్ కామడిటీస్ యాక్ట్ –1955,తెలంగాణ పిడిఎస్ కంట్రోల్ ఆర్డర్ – 2016 నిబంధనలను ఉల్లంఘించినట్లు పేర్కొన్నారు. సంబంధిత నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.చట్ట ప్రకారం ముందస్తు చర్యలు కొనసాగనున్నాయి.ఈ సమావేశంలో డిసిఓ ప్రేమ్ కుమార్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు,అంజయ్య ఓఎస్డీ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్ అక్రమ రవాణాపై పోలీసులు విచారించగా పాల్వంచకు చెందిన పలురు డీలర్లతోపాటు మరి కొంతమంది సివిల్ సప్లై కి చెందిన సిబ్బంది ఉన్నారు.పోలీసుల అదుపులో ఉన్న వారిలో ఎన్ శ్రీనివాసరావు ,వి ప్రశాంత్, జె సత్యవతి, భానోత్ కృష్ణకుమార్ ,అనిల్ కుమార్, ఎన్ రాజేష్, కే చంద్రం ,బి క్రాంతి ,ఏ లక్ష్మీదేవి , బోడ భద్రమ్మలు ఉన్నట్లు తెలిసింది ,ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వారిని రిమాండ్ చేసినట్లు సమాచారం

## క్రాంతి విద్యాలయం ఆధ్వర్యంలో మాక్ డ్రిల్, అగ్నిప్రమాద అవగాహనకార్యక్రమం

**భద్రాచలం టౌన్, డిసెంబర్ 5(ప్రజాజ్యోతి ):** భద్రాచలంలోని క్రాంతి విద్యాలయంలో శుక్రవారం మాక్ డ్రిల్, అగ్ని ప్రమాద అవగాహన కార్యక్రమం పాఠశాల కరస్పాండెంట్ సమతా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా భద్రాచలం ఫైర్ స్టేషన్ అధికారి జి. శ్రీనివాస్ హాజరై విద్యార్థులకు అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వెంటనే అలర్ట్ చేసే పద్ధతులు, ఫైర్ ఎక్స్టింగ్విషర్ వినియోగ విధానం వంటి అంశాలను తెలియజేశారు.అగ్నిప్రమాదం జరిగినప్పుడు సమయాన్ని వృథా చేయకుండా ఎలా స్పందించాలో, సురక్షితమైన ప్రదేశానికి ఎలా చేరుకోవాలో, చిన్నపాటి అగ్ని ప్రమాదాలను నివారించడానికి అనుసరించాల్సిన సులభమైన పద్ధతులను శ్రీనివాస్ ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. అనంతరం ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించి అత్యవసర పరిస్థితుల్లో ఎలా బయటపడాలో ప్రయోగాత్మకంగా చూపించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఫైర్ సేఫ్టీ పట్ల అవగాహన పెంపొందించడం అత్యంత అవసరం. అగ్నిమాపక శాఖ అందించిన ఈ శిక్షణ వారి భవిష్యత్తుకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫైర్ లీడింగ్ ఫ్యాకల్టీ బి. కే రామిరెడ్డి ,రాజాబాబు ,ఎల్. శివాజీ, పాఠశాల అధ్యాపక అధ్యాపకేతర బృందంతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు

